నవతెలంగాణ
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

పిడుగుపాటుకు 70 గొర్రెలు మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని రాంసింగ్ తండాలో పిడుగుపాటుకు 70 గొర్రెలు మృతి చెందాయి. గురువారం గొర్రెల కాపరి చౌహాన్ వినేష్ గొర్రెలు మేపడానికి అడవికి తీసుకెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో పిడుగు పడటంతో 70 గొర్రెలు మృతి చెందాయని బాధితుడు తెలిపాడు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితునికి ప్రభుత్వం ఆర్థిక సాయం అధించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



బకెట్‌లో పడి బాలుడి మృతి

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని తేజాపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం బకెట్‌లో పడి చౌదరి తన్వీర్(10నెలలు) మృతి చెందాడు. గిర్మాజి, సునీత దంపతులకు ఏడేళ్ల క్రితం పెండ్లి అయింది. ఇద్దరు కూతుళ్ల తర్వాత కుమారుడు జన్మించాడు. తండ్రి వ్యవసాయ పనులకు వెళ్లగా తల్లి ఇంటి పనుల్లో నిమగ్నమై ఉంది. తన్వీర్ ఆడుకుంటూ నీళ్ల బకెట్‌లో పడిపోయి మృతి చెందాడు. కొంత సేపటి తర్వాత తల్లి గమనించి కుటుంబ సభ్యులతో కలిసి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పోశెట్టి తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన ట్రిపుల్ ఐటీ వీసీ



ముధోల్: ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ క్యాంప్ ఆఫీస్ కొచ్చిన ఆయనకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం క్యాంప్ ఆఫీస్ ఛాంబర్‌లో మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. బాధ్యతలు చేపట్టిన వీసీకి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

పాత కక్షలతో పట్టణంలో దాడులు



మంచిర్యాల : కొన్ని రోజులుగా జిల్లాలో జరుగుతున్న వరుస దాడుల నేపథ్యంలో ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, పట్టణంలో శాంతిభద్రతల రక్షణకు పోలీస్ వ్యవస్థ పని చేస్తోందని డీసీపీ ఎ.భాస్కర్ తెలిపారు. గురువారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాత కక్షల నేపథ్యంలో ఇటీవల మంచిర్యాల పట్టణంలో పలు దాడులు జరిగాయని, దాడులకు పాల్పడిన ప్రతి ఒక్క నేరస్తుడిపై చట్ట పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జూన్ 2న బీఆర్ఎస్ నాయకుడు గడప రాకేష్‌పై జరిగిన దాడిలో ప్రధాన నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద జరిగిన దాడి విషయంలో రెండు గ్రూపులకు చెందిన యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సివిల్ తగాదాల్లో తల దూరుస్తూ, భూకబ్జాలకు పాల్పడుతున్న పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టణంతో పాటు జిల్లాలోని పలు జిమ్‌లలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో జిమ్ నిర్వాహకులను హెచ్చరించామని తెలిపారు. గంజాయి, వ్యభిచారం, మత్తు పదార్థాల వినియోగం అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్నారు. యువకులు సహనం కోల్పోయి దాడులు, మహిళలను వేధించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినట్లైతే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే వారిపై రౌడీ షీట్, పీడీ యాక్ట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ ఆర్.ప్రకాష్, ఎస్ఐలు సనత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలను బహిష్కరించిన మహిళలు



కాసిపేట : గ్రామ పంచాయతీ ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మహిళలు బహిష్కరించారు. చీరలు దుర్వాసన వస్తున్నాయని, అధ్వానంగా ఉన్నాయని, పాత చీరలనే అందిస్తున్నారని ఆరోపిస్తూ వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేయాల్సిన చీరలను ఆలస్యంగా వచ్చినా గతం కంటే మెరుగ్గా ఉంటాయని ఆనందంతో వచ్చిన మహిళలకు అక్కడ చీరలను చూసి అవక్కాయ్యారు. ఐకేపీ సిబ్బంది చీరలు అందించేందుకు మూట విప్పగా దుర్వాసన రావడంతో మహిళలు తిరస్కరించారు. గత ప్రభుత్వంలో మిగిలిన చీరలకు కాంగ్రెస్ ప్రభుత్వం లేబుల్స్ మాత్రమే మార్చి పెట్టారని మహిళలు ఆరోపిస్తూ వాటిని తీసుకోకుండా నిరాకరించారు. మహిళల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మండల వ్యాప్తంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఐకేపి ఏపీవో వెంకటేశ్వర్‌ను సంప్రదించగా మండలానికి బతుకమ్మ చీరల పంపిణీ కోసమని 10,770 వచ్చాయని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయండి



ఆదిలాబాద్‌టౌన్ : చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను గురువారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరిస్తూ జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. సైన్స్ సంబరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కృషి చేయలన్నారు. 8,9,10వ తరగతి ప్రతి విద్యార్థి చేత చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ రాయించేలా చూడాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 7న జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, జిల్లా గౌరవ అధ్యక్షులు సామ రామ్‌రెడ్డి, ప్రకాష్, అధ్యక్షులు ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి ఊశన్న, జిల్లా కోశాధికారి లింగారెడ్డి, జిల్లా నాయకులు గంగన్న, లింగన్న, శ్రీధర్‌బాబు, నాగరాజు, మెస్రం రాజు, రాష్ట్ర నాయకులు నూతుల రవీందర్, రామచంద్రయ్య, లక్ష్మారెడ్డి, బిఎస్.రెడ్డి పాల్గొన్నారు.



ఆదివాసుల అస్తిత్వానికి భీం పోరాటం

- సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- కుమురం భీం వర్ధంతి వేడుకల్లో రాష్ట్ర మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసుల అస్తిత్వానికి కుమురం భీం పోరాటం నాందిగా నిలిచిందని, వారి అభివృద్ధి కోసం ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కుమురం భీం 84వ వర్ధంతి వేడుకలకు ఎంపీ గెడం నగేష్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటిడిఏ పిఓ కుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, రామగుండం సీపీ శ్రీనివాస్, ఎస్పీ డివి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, భీం మనుమడు సోనేరావు, ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హరీష్ బాబు, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కుమురం భీం విగ్రహానికి నివాళులు అర్పించి, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుమురం భీం, బిర్సా ముండా, సమ్మక్క సారక్క లాంటి మహనీయులు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. భీం పోరాటంతో హైమన్ డార్ఫ్ ఆధ్వర్యంలో వేసిన కమిటీతో 5వ షెడ్యూల్, 1/70 చట్టం, ఐటిడిఎ ఏర్పాటు, పెసా రూపకల్పన లాంటి వాటికి నాందిగా నిలిచాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 1,64,000 ఎకరాల భూమికి ఆదివాసులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేశామని గుర్తు చేశారు. ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములపై అటవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని తెలిపారు. అత్యుత్సాహం వద్దు వారికి అవగాహన కల్పించడమే ముద్దు అనే సూత్రం ఆధారంగా ముందుకు పోవాలన్నారు. అటవీ అధికారులు తమ పరిధి దాటితే సహించేది లేదని హెచ్చరించారు. అటవీ రక్షణలో ఆదివాసుల సాయం కోసం గతంలో విఎస్ఎస్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. సమన్వయంతో అధికారులు ముందుకు సాగాలన్నారు. జోడేఘాట్ ప్రాంతాన్ని మహా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించినట్లు



వెల్లడించారు. దీనికోసం తక్షణమే రూ.6కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కుమురం భీం ప్రాజెక్టు మరమ్మతులు చేయడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జోడేఘాట్ పరిధిలోని 12 పోరు గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. గిరిజన సలహా కమిటీ ఏర్పాటు చేశామని, త్వరలోనే సమావేశం నిర్వహించి సమస్యలు కొలిక్కి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఐటిడిఎలను పట్టించుకోలేదని, వాటి బలోపేతానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుమురం భీం చేసిన పోరాటం అస్తిత్వం కోసమేనని, అటువంటి అస్తిత్వాన్ని నిలపడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఉట్నూర్ కేంద్రంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, దీన్ని వినియోగించుకోవాలని వివరించారు. కుల గణనలో ఆదివాసుల 9 తెగలు తమ పూర్తి వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. కోయ తెగకు సంబంధించి సర్టిఫికెట్ల జారీలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర జీసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ జెడ్పిటిసి నాగేశ్వరరావు, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకుడు ఉదయకాంత్ పాల్గొన్నారు.

ఆదివాసులపై కేసులు ఎత్తివేయాలి : గెడం నగేష్, ఆదిలాబాద్ ఎంపీ




జైనూర్ సంఘటనలో ఆదివాసులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలి. జిల్లాలో పెండింగ్ రోడ్లకు అటవీ అనుమతులు రావాలంటే రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించడంతో పాటు ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ చేయకుండా అటవీ అనుమతులు ఎలా వస్తాయి. ఇవి చేసి పత్రాలను తనకు ఇస్తే అటవీ అనుమతులు తెప్పిస్తానని పునరుద్ఘాటించారు.

ఆదివాసుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే



జిల్లాలోని ఆదివాసుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. 2014లో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారికంగా జోడేఘాట్‌లో వేడుకలు నిర్వహిస్తున్నాం. పట్టాలిచ్చిన భూములకు గిరి వికాసం అమలు చేయాలి. అడ, వట్టివాగు ప్రాజెక్టు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలి.


భీం ఆశయ సాధనకు కృషి : వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



మావ నాటి మావా రాజ్ అనే భీం నినాదం కోసం కృషి చేస్తున్నాం. పోరాటాలతోనే ఆదివాసులకు ప్రత్యేక చట్టాలు వచ్చాయి. ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారు.

ఆదివాసీ కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు : ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉన్న ఆదివాసీ కుటుంబాలకు 3500 ఇండ్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నాం. వీటి సంఖ్యను 5000కు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే వర్ధంతి నాటికి రోడ్డు పూర్తి చేస్తాం. వర్ధంతి సభ సంస్కృతిని తమ హయాంలోనే 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశాం.



ఐటీడీఏను బలోపేతం చేయాలి : పాల్వాయి హరీష్ బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే



ఐటీడీఏ పూర్తిగా నిధులు లేక నిర్వీర్యం అవుతోంది. దానిని బలోపేతం చేయాలి. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలి. సిర్పూర్ నియోజకవర్గంలో దశలి పట్టు కార్మికులను కూడా అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. అటవీ భూముల్లో జీడి మామిడి తోటలు పెంచితే ఆదాయం పెరుగుతుంది.

ఆదివాసులకు అసలైన పట్టాలివ్వాలి : సోనేరావు, భీం మనుమడు

ఆదివాసీ సమాజానికి కుమురం భీం గుర్తింపు తీసుకొచ్చాడు. ఆదివాసులకు పోడు భూములకు సంబంధించి ఇచ్చిన పట్టాలు అసలైనవిగా ఉండాలి. రైతుబంధు, రైతుబీమా లాంటివి వర్తించేలా చూడాలి.





స్థానిక సమస్యలు పరిష్కరించాలి : పెందూర్ రాజేశ్వర్, ఉత్సవ కమిటీ చైర్మన్

వర్ధంతి రోజు పెద్ద ఎత్తున వేడుకలు చేయడం బాగానే ఉన్నప్పటికీ స్థానిక సమస్యలు పరిష్కారం కావడం లేదు. హట్టి నుండి టోకెన్ మామిడి వరకు రోడ్డు పూర్తి చేయాలి. వాగుదాం నుండి జోడేఘాట్ రోడ్డు చేస్తే ఆసిఫాబాద్ వెళ్లడానికి 50 కిలోమీటర్లు తగ్గుతుంది.

ఏజెన్సీ చట్టాలపై అధికారులకు అవగాహన : వెంకటేష్ దోత్రే, జిల్లా కలెక్టర్



ఏజెన్సీ చట్టాలపై జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పోరు గ్రామాల్లో ఇండ్ల నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తాం. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్యం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.



ఆదివాసులు విద్యలో అభివృద్ధి చెందాలి : కుష్బూ గుప్త, ఐటిడిఎ పిఓ

ఆదివాసులు విద్యలో అభివృద్ధి చెందితే అన్ని రకాల అభివృద్ధి సాధ్యమవుతుంది. హైమన్ డార్ఫ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. గోండి నేర్చుకుని మాట్లాడానని ఏమైన తప్పులుంటే క్షమించాలని కోరారు.

కళాశాలలు ఓపెన్..!

- నేటి నుంచి తెరుచుకోనున్న ప్రయివేటు డిగ్రీ కళాశాలలు
- టీపీడీపీఎంఏ నిరసనకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు హామీ
- యధావిధిగా ప్రారంభం కానున్న తరగతులు

ఉమ్మడి జిల్లాలో ప్రయివేటు డిగ్రీ కళాశాలలు శుక్రవారం నుంచి తెరుచుకోనున్నాయి. మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రయివేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ చేసి నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నెల 14న కళాశాలల బంద్ పాటించగా.. మూడు రోజుల పాటు కళాశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకుండా మూసివేశారు. తాజాగా టీపీడీపీఎంఏ చేపడుతున్న నిరసనకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ సంఘం నేతలతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు తెలిసింది. మరోపక్క బీసీ సంఘం జాతీయ నేత ఆర్.కృష్ణయ్య సైతం సంఘం నేతలతో మాట్లాడి కళాశాలలు ప్రారంభించేలా ఒప్పించినట్లు తెలిసింది. దీంతో నేటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కళాశాలలు ప్రారంభం కానున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ప్రయివేటు డిగ్రీ కళాశాలలు పునప్రారంభం కానున్నాయి. ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో మూడు రోజుల పాటు కళాశాలలను బంద్ చేసి నిరసన తెలిపిన యాజమాన్యాలు తాజాగా తెరిచేందుకు సిద్ధమయ్యాయి. టీపీడీపీఎంఏ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కళాశాలలు మూతపడటంతో ఇందులో చదివే వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠాలు కొనసాగకపోవడంతో వార్షిక పరీక్షల ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. మరోపక్క మూడేండ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు రూ.కోట్లలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు సైతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. కళాశాలలను నడిపించలేని పరిస్థితి రావడంతో నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నెల 14న కళాశాలలను బంద్ చేసి నిరసన తెలపడంతో విద్యార్థులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో పాఠాలు కొనసాగకపోవడంతో ఆవేదనకు గురయ్యారు. తాజాగా పెండింగ్ బకాయిలపై టీపీడీపీఎంఏ నేతలతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చించినట్లు తెలిసింది. అతి త్వరలోనే బకాయిలు విడుదల చేస్తామని హామీనిచ్చినట్లు ఆ సంఘం నేతలు చెబుతున్నారు. మరోపక్క బీసీ సంఘం జాతీయ నేత ఆర్.కృష్ణయ్య సైతం ఈ సమస్యపై తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. అతి త్వరలోనే బకాయిలు విడుదల చేయలేని పక్షంలో తానే స్వయంగా నిరహార దీక్షకు దిగుతానని..కొన్ని రోజులు ఓపిక పట్టాలని సంఘం నేతలతో మాట్లాడినట్లు తెలిసింది. వీరి కోరిక మేరకు కళాశాలలను ప్రారంభిస్తామని టీపీడీపీఎంఏ నేతలు చెబుతున్నారు.

రూ.కోట్ల బకాయిలు పెండింగ్..!

ఉమ్మడి జిల్లాలో సుమారు 76 ప్రయివేటు డిగ్రీ కళాశాలలు ఉండగా వీటి పరిధిలో సుమారు 50వేలకు పైగా మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిసింది. వీరికి ప్రభుత్వం ప్రతి ఏటా ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ఆయా కళాశాల యాజమాన్యాల ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రతి ఏటా ఈ నిధులను జమ చేయాల్సిన ప్రభుత్వం 2022 నుంచి 2024 వరకు జమ చేయకపోవడంతో పెండింగ్ బకాయిలు పెరిగిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో బీసీ విద్యార్థులు 15వేల మంది వరకు ఉండగా వీరికి రూ.9.26కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఎస్సీ విద్యార్థులు 1266 మంది ఉండగా వీరికి గాను రూ.1.16కోట్లు బకాయిలు రావాల్సి ఉందని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.3వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిలు ఉన్నట్లు టీపీడీపీఎంఏ సంఘం నేతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిగితా జిల్లాలోనూ ఇదే రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం పాత బకాయిల చెల్లింపులకు ముందుకు రావడంతో కళాశాలల యాజమాన్యాలతో పాటు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవతెలంగాణ-కడెం

మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంబారిపేట్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అంబారిపేట్ గ్రామానికి చెందిన బొలిశెట్టి రాజన్న



కుమారుడు బొలిశెట్టి శ్రీనివాస్(34) మద్యానికి బానిసై, మద్యం మానలేకపోతున్నానని జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి 7గంటలకు గుర్తు తెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి 26 మంది ఎంపిక కావడం హర్షణీయమని ఆదిలాబాద్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపిక కావడానికి కృషి చేసిన స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్‌ను గురువారం స్టడీ సర్కిల్‌లో శాలువాతో సత్కరించి, శుభకాంక్షలు తెలిపారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో దాదాపు 225 మంది నిరుద్యోగులకు, ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమని తెలిపారు. సన్మానించిన వారిలో బొజ్జ మహేందర్, గోవర్ధన్ సావాపురే, లఖన్ ఉన్నారు.



హక్కుల కోసం పోరాడిన మహావీరుడు కుమురం భీం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసుల ఐక్యత, హక్కుల కోసం పోరాడిన మహావీరుడు కుమురంభీం అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. హీరాసుక జాగృతి సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట నిర్వహించిన 'కుమురంభీం 84వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. అనంతరం కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హీరసుక ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఆదివాసుల ఐక్యత, జల్, జంగల్, జమీన్ కోసం నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. ఆదివాసుల హక్కుల గురించి తెలుసుకొని పుస్తకాన్ని రచించారని గుర్తు చేశారు. భీం స్ఫూర్తితో ఆదివాసుల హక్కుల కోసం ప్రభుత్వంతో పాటు అధికారులు పని చేస్తున్నారన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదివాసుల సమస్యలను తెలుసుకోవడానికి ఉట్నూర్‌లో సార్మేడి, పటేళ్ళ, ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారన్నారు. ఆదివాసులు ఐక్యంగా ఉంటూ సమస్యలను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆదివాసీ సంఘాల నాయకులు సిడం రాంకిషన్, తానాజీ, మాదవ్, రేణుక పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

నిరాంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసులకు అండగా పోరాడిన గోప్ప వీరుడు కుమురంభీం అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం కుమురంభీం 84వ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోకి కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలామున్నా, నైతం రవీందర్, దశరథ్ పటేల్, రకేష్, నగేష్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కుమురంభీంకు ఘన నివాళులర్పించారు. కుమురంభీం చౌరస్తాలోని భీం విగ్రహానికి మాజీ మంత్రి, పార్టీ అధ్యక్షుడు జోగు రామన్న పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి త్యాగలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, పార్టీ నాయకులు ఆజయ్, పరమేశ్వర్, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, అజీజ్, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో కుమురంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో భీం విగ్రహానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గిమ్మ సంతోష్, నగేష్, షకీల్, ఏవన్, శ్రీలేఖ, రఫీక్, లోక ప్రవీణ్‌రెడ్డి, నర్సింగ్, రాము ఉన్నారు.



తలమడుగు : కమురంభీం 84వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం కుమురంభీం విగ్రహానికిని మండల ఆదివాసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మండల నాయకుడు కుమ్ర జ్ఞానేశ్వర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తలమడుగు గ్రామపటేల్ దుర్వ దర్మా, నీలగిరి అశోక్, కాడే స్వామి, నల్ల పద్మకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంటి, నేతుల గంగన్న, దూర్వా నరేందర్, గోడం ప్రభాకర్, లింగన్న, ఆదివాసీ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి : ఆదివాసీ హక్కుల పోరాటయోధుడు కుమురంభీం 84వ వర్ధంతిని గురువారం తాంసి, భీంపూర్ ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆదివాసీ గిరిజన గ్రామాలలో కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లులు లక్ష్మీ, స్రవంతి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఎంపీఓ లింగయ్య, ఆయా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఆదివాసుల పోరాట యోధుడు కుమురంభీం 84వ వర్ధంతిని మావల మండలంలోని కుమురంభీమ్ కాలనీలో జెండా ఆవిష్కరించి, కుమురంభీంకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, మావల మండలాధ్యక్షులు వెడ్మ ముకుందరావు, రైతు సంఘం ఆదిలాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, రైతు సంఘం ఆదిలాబాద్ డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి మెస్రం తులసిరామ్, తొడసం ప్రకాష్, కుమ్ర గోవింద్ రావు పాల్గొన్నారు.

యాపల్‌గూడలో...

మండలం యాపల్‌గూడ గ్రామంలో గురువారం కుమురంభీం 84వ వర్ధంతి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఉయక విష్ణు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదివాసులకు జల్, జంగల్, జమీన్ హక్కు కోసం ప్రాణాలర్పించిన కుమురంభీం తెగువను ప్రతి ఆదివాసీ బిడ్డ అంది పుచ్చుకోవాలని కోరారు. ఆయన ఆదివాసుల అభివృద్ధి కోసం ప్రాణ త్యాగం చేసారని, నేటి యువత ఆయనలోని పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని, మన సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుట్టూ వక్కల 6 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కొడప నారాయణ, లంక రాఘవులు, స్వామి, భారత్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ గురువారం కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి భీమ్ పోరాటపటిమని కొనియాడారు. అతని వెంట ఎల్మ రాంరెడ్డి ఉన్నారు.

ముథోల్ : జల్, జంగల్, జమీన్, కోసం కుమురంభీం పోరాటం మరువలేనిదని ఎడ్‌బిడ్ మాజీ సర్పంచ్ నిమ్మ పోతన్న అన్నారు. గురువారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో కుమురంభీం వర్ధంతిని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమురంభీం పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తాత్రి, సాయినాథ్ పాల్గొన్నారు.

నిర్మల్ : తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజన పోరాటయోధుడు కుమురంభీం 84వ వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తొడసం శంబు మాట్లాడారు. ఆదివాసీ హక్కుల కోసం కుమురంభీం చేసిన పోరాటం అద్భుతమని, ఆయన త్యాగాలు ఆదివాసీ సమాజానికి చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పోరాటం నిజాం సర్కార్‌ను ఎదుర్కొనడంలో కీలకమని, ఇలాంటి నాయకుడి వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యాఖ్యానించారు. అయన స్ఫూర్తితో ప్రస్తుత ఆదివాసీ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక నిర్ణయాలను అర్థం చేసుకొని, ఐక్య పోరాటాలు చేయాలని, భావోద్రేక విషయాలను, తెగల మధ్యలో చిచ్చు పెట్టె వారి పట్ల జాగ్రత్త పడుతూ ఐక్యతను కాపాడుకుంటూ పోరాటాలను ముందుకు తీసుకోని వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోయం సూర్యభాన్, ఉయిక భీమ్‌రావు, పెందూర్ లక్ష్మణ్, పంద్రం ఆనంద్‌రావు, ఆత్రం మారుతి, గణేష్, అర్జున్ పాల్గొన్నారు.

నార్నూర్ : జల్, జంగల్, జమీన్ కోసం ఒంటరిగా పోరాటం చేసిన పోరాట యోధుడు కుమురంభీం అని తుడుందెబ్బ నాయకులు మడావి మాన్కు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మడావి మాన్కుతో పాటు నార్నూర్ మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్ మాట్లాడారు. ఆదివాసుల హక్కుల కోసం విరోచిత పోరాటం సాగించారని అన్నారు. హక్కుల సాధన కోసం కుమురంభీం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, పేసా చైర్మెన్ రాథోడ్ సికిందర్, ప్యాక్స్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ షేక్ దాదే అలీ, మాజీ ఉపసర్పంచ్ మహేందర్ చౌహాన్, పూసం భావ్‌రావ్, పూసం దేవ్‌రావ్, కినక కృష్ణ పాల్గొన్నారు.

ఉట్నూర్ : జల్, జంగల్, జమీన్ కోసం ఆదివాసుల హక్కుల సాధనకు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కుమురంభీం అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేబి కాంప్లెక్స్‌లోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.నిజాం పాలన వ్యతిరేకంగా అటవీ హక్కుల సాధనకు నిరంతరం భీం పోరాడారన్నారు. భీం పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ భీంను ఆదర్శంగా తీసుకోని అయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో కూడా వర్ధంతి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, బీజేపీ నాయకులు రితేష్ రాథోడ్, కొండరి రమేష్, లంబాడా జేఏసీ నాయకులు జగన్, రామారావు, శ్రీ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు జాదవ్ వసంతరావు, ప్రధాన కార్యదర్శి చవాన్ సేవాదాస్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ మహేందర్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్ : కుమురంభీం అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వా విశ్వేశ్వర్ అన్నారు. గురువారం మండలకేంద్రంతో పాటు సొనాల గ్రామంలోని కుమురంభీం 84వ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం ఉపాధ్యక్షులు కుర్మే రాజన్న, మండల కమిటీ అధ్యక్షులు కనక అమృత్‌రావు, కార్యదర్శి మండాడి రాము, జిల్లా సలహాదారులు పంద్రం శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, ఎస్సై ప్రవీణ్, పొట్నాపూర్ సార్మేడి ఆడే భీంరావ్, నాయకులు తొడసం భూమన్న, మండాడి నాగోరావ్, కోవా వెంకట్‌రావు, కొడప విజయ్, గోడం జూగదిరావు, మాడవి మనోహర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ : నిజాం నవాబ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఆదివాసీ రాజ్యం కోసం, స్వపరిపాలన కోసం, ఆదివాసీ హక్కుల కోసం తుపాకీ పట్టి ఆదిలాబాద్ అడవులల్లో గర్జించి, నిరంతరం నిజాం తో పోరాడి వీరమరణం పొందిన కుమురంభీం 84వ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు, సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి కుమురంభీం విగ్రహానికి పులా మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెడిగూడ సార్మేడి మెస్రం శంభు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ గ్రామ పటేల్ మడావి భీంరావు, రఘుగూడ గ్రామ పటేల్ ఆడ భీంరావు, ఆదివాసీ నాయకులు జలైజాకు, కుమురం కోటేష్, గంగారాం, దేవురావు పాల్గొన్నారు.















నార్నూర్‌లో భోగ్ భండార్



నవతెలంగాణ-నార్నూర్

రామారావు మహారాజ్ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో విజయ్‌నగర్ కాలనీలో బోగ్‌బండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి భోగ్ భండార్ పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యద్శి గజానంద్ నాయక్ మాట్లాడుతూ రామారావు మహారాజ్ బంజారా లంబాడి సమాజానికి దారి చూపిన దార్శనికుడన్నారు. బంజారా సమాజాన్ని ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయించడంలో రామారావ్ మహారాజ్ కృషి ఉందని అన్నారు. ఆయన మార్గంలో నడిచి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, మాజీ ఉప సర్పంచ్ మహేందర్ చౌహాన్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, యశ్వంత్ రావ్, ఫకీరా నాయక్, రాథోడ్ దత్తారాం, బాలాజీ జాదవ్, బిక్కు చౌహాన్, అనిల్ నాయక్, బానోత్ శాంతారావ్, శ్రీనివాస్, చౌహాన్ సురేష్, రాథోడ్ భారత్, అవినాష్, మాణిక్ రావ్, మోతీలాల్, విలాస్, శ్రీరామ్, పవార్ భారత్, బలిరాం, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

అంగన్‌వాడీల పెండింగ్ వేతనాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని మండలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న మాట్లాడుతూ రాష్ట్రంలో మినీ నుంచి మెయిన్ అయినా 4వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని అన్నారు. వీరికి పూర్తిగా వేతనం చెల్లించే విధంగా ఆర్థిక శాఖ ట్రెజరీలో ఆపరేట్ చేయాలని అన్నారు. వీరికి హెల్పర్లను నియమించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం ఖాళీల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు పి.రత్నమాల, ముక్త, సుభద్ర, పద్మ, కృషివర్త, కవిత, సురేఖ, పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

బుద్ధుని మార్గంలో నడువాలి



నవతెలంగాణ-నార్నూర్

లోకంలో శాంతిని నెలకొల్పడం గతమ బుద్ధుని సందేశమని ప్రతి ఒక్కరూ బుద్ధుని మార్గంలో నడువాలని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో త్రిరత్న బుద్ధ విహార్‌లో వర్షవాస్ బుద్ధ ధమ్మ గ్రంథం సమాప్త కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధమ్మ ప్రవక్ జీవన్ మాట్లాడారు. బౌద్ధ ఉపాసకులు బుద్ధుడు చూపించిన శాంతి మార్గములో నడువాలని పిలుపునిచ్చారు. అనంతరం మిలింద్‌నగర్ నుంచి ప్రారంభమైన యాత్ర అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. శాంతి, కరుణ, మైత్రి సందేశాన్ని అందించిన బుద్ధుడి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని అయన సూచించారు. ప్రతి సంవత్సరం మూడు నెలలు సాగే వర్షావాస్ కార్యక్రమాన్ని ఎంతో నిష్ఠతో కొనసాగిస్తారని నిర్వాహకులు బాలాజీ కాంబ్లే తెలిపారు. కార్యక్రమంలో కామరాజ్ సాల్, కాంబ్లే మనోహర్, బౌద్ధ ఉపాసకులు, మాజీ జెడ్పీటీసీ కర్మన్‌కర్ హేమలత బ్రిజులాల్, సహకార సంఘం ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, అసోసియేషన్ అధ్యక్షులు లోఖండే కేశవ్‌రావ్, మాజీ ఎంపీటీసీ రుక్మాబాయి కాంతారావ్ దుర్గే, వినాయక్‌రావ్, పుండలిక్, భీంరావ్, అన్నాభావు సాఠే కమిటీ నాయకులు మహేందర్, మస్కే కేశవ్, అవినాష్, సునీల్, నిర్మలబాయి, కాంబ్లే అనిత, హేమలత, మీనాబాయి, మాయబాయి, చంద్రకళ, లోనాబాయి, పద్మబాయి, పంచశీలా, లక్ష్మి రాధాబాయి బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు పాల్గొన్నారు.

21న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐటీఐ కళాశాలలో పాస్ అయిన విద్యార్థులకు ఈనెల 21న ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రముఖ ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు ఈ మేళాలో పాల్గొని శిక్షణార్థులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. మేళాలో పాల్గొనేవారు అప్రెంటిస్‌షిప్.గావ్.ఇన్ పోర్టల్‌లో నమోదు చేసుకొని తగిన పత్రాలతో హాజరుకావాలన్నారు. ముఖ్యంగా టీఎస్ ఆర్టీసీ, అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్స్, ఐటీసీ ఫుడ్స్ వంటి ప్రముఖ సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు శిక్షణ పొంది తమ భవిష్యత్ అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి ఈ శిక్షణా మేళా మంచి అవకాశమని పేర్కొన్నారు. ఐటీఐ పాస్ అయిన విద్యార్థులు ఈ శిక్షణా మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఈ 9491460060 నెంబరును సంప్రదించాలని సూచించారు.

19న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలలో చదివే 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం కళా ఉత్సవ్ 2024 జిల్లాస్థాయి పోటీలు శాంతినగర్‌లోని జేఓఎస్ఆర్ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని డీఈఓ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 6 రకాల పోటీలు ఉంటాయని ఇందులో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి అర్హత పొందాలని, లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డు రకం వరి, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసి పరిశీలించి, తేమ శాతం ఎంత ఉందని తనిఖీ చేశారు. ఏ మిల్లుకు ట్యాగ్ చేసింది ఆ మిల్లుకు పంపాలని, ఏ రోజు సేకరించిన ధాన్యం అదే రోజు రవాణా అయ్యేలా చూడాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బుల చెల్లింపులో ఇబ్బందులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ దిగుబడి ఎలా ఉంది, కేంద్రాల్లో ధాన్యం అమ్ముతున్నారా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు నాణ్యత ప్రమాణాల మేరకు ధాన్యం తీసుకొచ్చేలా రైతులను ప్రోత్సాహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీఓ వెంకట రమేష్, ఏపీఎం మల్లేష్, సెంటర్ ఇన్‌చార్జి గంగాధర్, ఐకేపీ సీసీలు, మహిళలు పాల్గొన్నారు.



మినీ అంగన్‌వాడీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- నిర్మల్, నార్నూర్‌లో నిరసన, వినతిపత్రాలు అందజేత

నవతెలంగాణ-నిర్మల్

మినీ అంగన్‌వాడీలకు పూర్తి స్థాయి వేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత అన్నారు. గురువారం సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు 5 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని అన్నారు. వీరికి ఆర్థిక శాఖలో పూర్తి వేతనం చెల్లించే విధంగా తగిన సవరణలు చేయాలని అన్నారు. ఈ విషయమై అక్టోబర్ 24న ఎమ్మెల్యే, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలనీ నిర్ణయించామని అన్నారు. నవంబర్ 4న అన్ని జిల్లాల్లో కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు చేస్తామన్నారు. నవంబర్ 11న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తామన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షురాలు శైలజ, జిల్లా సహాయ కార్యదర్శి వనజ, భాగ్యలక్ష్మి విజయ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నార్నూర్ : మినీ అంగన్‌వాడీల ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు అన్నమొల్ల కిరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మినీ నుంచి మెయిన్ 4 వేల అంగన్‌వాడీ టీచర్‌లకు పూర్తి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. వీరికి పూర్తి వేతనం చెల్లించే విధంగా ఆర్థిక శాఖ ట్రెజరీలో అప్‌డేట్ చేయాలని అన్నారు. వీరికి హెల్పర్‌లను నియమించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచశీల, పంచపులా, నిరీష, లక్ష్మీ, జంగు, మల్లు, అంజులత ఉన్నారు.



నిర్మల్ : సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

వ్యాధుల నివారణకు టీకాలు

నవతెలంగాణ-కౌటాల



పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలను అందిస్తున్నామని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని తలోది గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులు, గేదెలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు మూగ జీవాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటికి ఎలాంటి వ్యాధులు సోకిన ఆ రైతు తమకు సమాచారం అందిస్తే ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఆయన వెంట పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, సందీప్, భిక్షపతి, ప్రకాష్, రైతులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జనకాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయబాబు తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం విద్యార్థులు, గైడ్ టీచర్స్ వి. రాజేష్, డి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో బయలుదేరినట్లు పేర్కొన్నారు. కృత్రిమ మేధ అనే అంశంపై వీరు ప్రదర్శనీయనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలోను ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులను అభినందించారు.

భీం పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



భీం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ (ఎం) నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మా గ్రామంలో రాజ్యం మా రాజ్యం అనే నినాదంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కుంరంభీం అని, ఆయన పోరాటాన్ని ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం కుమురంభీం 84వ వర్ధంతిని స్థానిక సీపీఐ (ఎం) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ జోడేఘాట్ ప్రాంతంలో 12 గ్రామాలలో గిరిజన రాజ్యాధికారాన్ని నెలకొల్పేందుకు ఆయన అలుపెరుగని పోరాటం చేశాడన్నారు. నూతన ఆర్థిక విధానాలు, సరళీకరణ విధానాల అమలులో ప్రస్తుత ప్రభుత్వం చూపెడుతున్న దందుడుకు చర్యల వల్ల గిరిజనుల జీవితాలు మరింత దుర్భరమయ్యాయని ఆరోపించారు. నేటికీ గిరిజనులు తమను తాము కాపాడుకునేందుకు రాజ్యాంగబద్ధంగా నిరంతర పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ గిరిజనులకు అటవీ హక్కులు ఎక్కడ కూడా అమలు కావడం లేదని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని బయట ప్రాంతాల స్థాయికి తీసుకురావడం కోసం ఐటీడీఏను స్థాపించి 50 ఏండ్లు గడిచినా ఇప్పటికీ లక్ష్యం నెరవేరడలేదని అన్నారు. అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం వేల ఎకరాల అటవీ భూములను గిరిజనుల నుండి తీసుకొని కార్పోరేట్లకు కట్టబెడుతోందని అన్నారు. తరతరాలుగా పోరాటం చేసి సాధించుకున్న గిరిజన చట్టాలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, దిగిడ బక్కన్న, వనిత పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో..

పీఆర్‌టీయూటీఎస్ కాగజ్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో కుమురంభీం వర్ధంతిని నిర్వహించారు. దాదానగర్ చౌరస్తాలోని భీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు యుఎన్ చారి, ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్, మండల అధ్యక్షులు ఎనగంటి భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పత్తిపాక శ్రావణ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కూడా భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక దాదానగర్ చౌరస్తాలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జయదేవ్ అబ్రహంతో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌటాల : అమరజీవి కుమురం భీం 84వ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి గావుడె హన్మంతు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతలమానేపల్లి మండల విద్యాధికారి జయరాజు, ఉపాధ్యాయులు తిరుపతి, మధూకర్, అశోక్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కుమురం భీం 84వ వర్ధంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ముందుగా భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ హైమద్, డిప్యూటీ తహసీల్దార్ స్రావన్, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం : కుమురం భీం వర్ధంతిని మండలంలోని బిబ్రా గ్రామంలో గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఇందులో ఆదివాసీ గిరిజన సంఘం యువ నాయకులు అల్లకొండ లక్ష్మణ్, కొడిపే నవీన్, మాజీ సర్పంచ్ బండ కృష్ణమూర్తి, నాయకులు సుంకరి వెంకన్న, మణికంఠ, విగ్నేశ్వర్, జంషీద్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని మురళిగూడ గ్రామపంచాయతీలో భీమ్ వర్ధంతి సందర్భంగా ఆదివాసీ నాయకులు, గ్రామస్తులు కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసి సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, మాజీ సర్పంచ్ ఈశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీమ్ 84వ వర్ధంతి వేడుకలు జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భీం విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, మొహర్లే శ్యామరావు, మండోరే బాబురావు, జిట్టానేని మల్లేష్ పాల్గొన్నారు.

టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో..

టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి బీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఊషన్న, సుభాష్, నవీన్, మండల నాయకత్వం రవి,సంతోష్, రాంటేంకి. సునీల్ కుమార్, దేవాజీ, శ్రీనివాస, రాజన్న, రాజేందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.







నవంబర్ 2 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నవంబర్ 2, 3 తేదీలలో కాగజ్‌నగర్‌లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ కోరారు. గురువారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యారంగంలో నెలకొన్న సమస్యలతో పాటు సామాజిక సమస్యలపై ఉద్యమిస్తూ పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో ప్రజాతంత్ర, లౌకికభావాల వ్యాప్తికోసం శ్రమిస్తున్నట్లు తెలిపారు. పోరాటాలలో భాగంగా ఎంతో మంది విద్యార్థి నాయకులను ఎస్ఎఫ్ఐ కోల్పోయిందని, వారి త్యాగాల బాటలోనే సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా విద్యార్థి పోరు గర్జన సైకిల్ యాత్రలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ యాత్ర ముగింపు సందర్భంగా వచ్చిన సమస్యలపై కలెక్టరేట్‌లను ముట్టడించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, సహాయ కార్యదర్శులు సుంకరి సాయి, నితీష్, అయూబ్, భీంరావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల ఆరోపణ అవాస్తవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అతిథి అధ్యాపకులు తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వారిని చూస్తామని ఆర్థిక శాస్త్రం అధ్యాపకులు ఎం.తిరుపతి అన్నారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ మహాత్మాను కలిసి వినతిపత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులు సతీష్‌కుమార్ చేసిన ఆరోపణలో ఏ మాత్రం వాస్తవం లేదని తెలిపారు. భవిష్యత్తులో నిరాధారమైన ఆరోపణలు చేయకుండా కళాశాల అభివృద్ధికి ఆటంకం కలిగించకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గనిపై ఏఐటీయూసీ ధర్నా



నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు విధులకు గైర్హాజరైతే జీఎం దగ్గర నుంచి అనుమతి తెచ్చుకోవాలని నోటీస్ బోర్డులో వేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ చాగం మల్లేష్ మాట్లాడారు. మూడు రోజుల కంటే ఎక్కువ గైర్హాజరైతే విధులకు హాజరయ్యేందుకు జీఎం నుండి స్లిప్ తెచ్చుకోవాలనే నిబంధనతో కార్మికులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. గతంలో కూడా ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికులను ఇబ్బంది పెట్టారని, కార్మికులు, కార్మిక సంఘాల వ్యతిరేకతతో నిర్ణయాన్ని ఉపసంహరించారన్నారు. మళ్లీ అలాంటి ప్రయత్నమే యాజమాన్యం చేస్తోందని, ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ధర్నా వద్దకు వచ్చిన గని మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గనిలో కార్మికుల గైర్హాజరు శాతం ఎక్కువ ఉన్నందున ఇలాంటి నిర్ణయం తీసుకున్నామన్నారు. డ్యూటీలకు అందరూ వచ్చే విధంగా చూడాలంటూ నోటీసు బోర్డులో పెట్టిన నిర్ణయాన్ని విరమిస్తున్నట్టు తెలిపారు. పాత పద్ధతి కొనసాగిస్తానని, అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, ఆసిస్టెంట్ సెక్రటరీ బొద్దుల వెంకటేష్, పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నర్సయ్య, కమిటీ సభ్యులు సుధాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం

నవతెలంగాణ - కాసిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఎంపిడివో సత్యనారాయణసింగ్, ఎంపీవో సఫ్దర్ ఆలీ పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను ప్రోఫార్మాలో పొందుపరచి వెంటనే అందజేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, గ్రామ పంచాయతీల అకౌంట్ వివరాలు, అకౌంట్లలో ఉన్న నిధుల వివరాలు ప్రోఫార్మాలో పొందుపరచి అందజేయాలని తెలిపారు. నర్సరీల ఏర్పాటు పూర్తి చేయాలని, సీడ్ ప్రొక్యూర్మెంట్ వివరాలు, మట్టి సేకరించాలని, గ్రీన్ బడ్జెట్ వివరాలు పంపించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, సెగ్రిగేషన్ షెడ్, కంపోస్టు తయారీ కొనసాగించాలని, ఎల్ఆర్ఎస్ సర్వేను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని, ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి డిసెంబర్ మాసం వరకు వంద శాతం వసూలు పూర్తి చేయాలని పేర్కొన్నారు.



అడవి బిడ్డకు ఘన నివాళి

- జనసంద్రమైన జోడేఘాట్
- వేలాదిగా తరలివచ్చిన గిరిజనం
- మంత్రి సీతక్క పలువురు ప్రముఖుల నివాళులు



నవతెలంగాణ-కెరమెరి

జల్, జంగల్, జమీన్ కోసం ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడి అసువులు బాసిన పోరాటవీరుడు.. ఆదివాసుల ఆరాధ్యదైవం కుమురం భీం 84వ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ జన సంద్రమైంది. రాష్ట్ర ప్రభుత్వం కుమురం భీం వర్ధంతిని అధికారికంగా చేపట్టడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోడేఘాట్‌కు వేలాదిగా గిరిజనులు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌ల నుంచి గిరిజనులు వేలాదిగా తరలి వచ్చారు. ఉదయం గిరిజన సాంప్రదాయ రీతిలో భీం మనుమడు సోనేరావు దంపతులు, భీం వారసులు, గ్రామస్తులు భీం సమాది వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కళాకారులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేలా చేపట్టిన సాంప్రదాయ నృత్యా ప్రదర్శణలు అందరినీ ఆకట్టుకున్నాయి. గొండి భాషలో పాడిన పాటలు సభ ప్రాంగణంలో ఉన్న ప్రజలను ఉత్తేజ పర్చాయి. దర్బార్‌లో ఆయా ప్రభుత్వశాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పలు స్టాళ్లను పరిశీలించారు.

భారీ బందోబస్తు

మంత్రి సీతక్కతో పాటు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు రావడంతో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. వారం రోజుల నుంచి జోడేఘాట్ అటవీ ప్రాంతంలో ప్రత్యేక పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు అణువణువు తనిఖీలు చేపట్టాయి. ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు భారీ బందో బస్తు నిర్వహించారు.

సభలో సమస్యలపై ఏకరువు

సభలో గిరిజన సంఘాల నాయకులు సమస్యలపై ఏకరువు పెట్టారు. తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన భీం వర్ధంతి దర్బార్‌లో ఇచ్చిన ఫిర్యాదులు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆదివాసీ తెగల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని, రోడ్డు నిర్మాణాలకు అటవీ అనుమతులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీఓ అంజత్ పాషా, నాయకులు ఆత్రం లక్ష్మణ్ రావు, మాడావి రఘునాథ్, కోవ విజయ్ కుమార్, ప్రభాకర్, భరత్ భూషణ్, ధర్ము మారుతి, మాడావి రాజు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

- మంత్రి సీతక్కకు ఉద్యమకారుల వినతి



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించినఉద్యమకాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకులు తోట లక్ష్మణ్, బోగే ఉపేందర్, అజ్మీర బాబురావు కోరారు. గురువారం గోలేటిలో రాష్ట్ర మంత్రి సీతక్కని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారన్నారు. ఉద్యమాన్ని అణిచివేయాలనే కుట్రలో భాగంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు 200 గజాల స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఫ్రీ బస్ పాస్, పెన్షన్ అలాగే ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

మంత్రిని కలిసిన సీఆర్టీలు

గిరిజన సంక్షేమ శాఖ ఏకోపాధ్యాయ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌కు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సీఆర్టీలు కోరారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు గోలేటి సింగరేణి అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ పరిధిలో చాలీచాలని వేతనాలతో గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. సీఆర్టీ ఉపాధ్యాయుల సమస్యలను సానుకూలంగా మంత్రి స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో సీఆర్టీ ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, విజేష్, గణపతి, నాగేష్, పి.గణపతి, వెంకటేశం, గోపాల్, రవీందర్, ప్రభాకర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి





నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహర్షి వాల్మీకి జయంతిని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దాసరి వేణు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. మనిషి ఏదో దశలో వాస్తవాన్ని తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూపునర్ రమేష్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశే శంకర్, బోయ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు పర్రే యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోరేశ్వర్, కవల్కర్ నారాయణ, మేంగ్రి అనంతరావు, చాపుడే సురేష్ పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో

జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఏఓ శ్రీనివాస్ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్, డీసీఆర్బీ, డీపీఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన : మహర్షి వాల్మీకి జయంతిని జీఎం కార్యాలయ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. జీఎం ఎం.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలామలలు వేశారు. అనంతరం రామాయణంలో ఉన్న నీతి వ్యాఖ్యలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎంఐఈ బెహర, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌటాల : మండలంలోని తాటిపల్లి గ్రామంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణాన్ని రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి జయంతి సందర్భంగా గ్రామంలో ఏక్కాహం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. జయంతి వేడుకల్లో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేగులగూడలో పశువులకు టీకాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని రేగులగూడ గ్రామంలో గురువారం పశువులకు టీకాలు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు గాను ఈ టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి సురేష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శైలేందర్, శ్రీనివాస్, గోపాలమిత్ర రమేష్‌బాబు, విజయ డైరీ సిబ్బంది సాయి పాల్గొన్నారు.



భీం ఆశయ సాధన దిశగా సాగాలి

నవతెలంగాణ-జన్నారం



ఆదివాసుల కోసం పోరాటం చేసిన మహావీరుడు కుమురం భీమ్ అని ఆయన స్ఫూర్తిని అనుసరించాలని రాజ్ గుండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు హనుమంతరావు, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడాం కాలి అన్నారు. గురువారం భీం 84వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఇంధన్‌పల్లి చౌరస్తా వద్ద కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు, రాయి సెంటర్ సార్‌మేడి పూసం సోనేరావు, ఆదివాసీ సేన అధ్యక్షులు తుమ్రం లక్ష్మణరావు, ఆత్రం నరసింగరావు, పేంద్రం వసంతరావు, గంగు పటేల్, మానిక్‌రావు, సోనేరావు, కిషన్, జంగు రామస్వామి, పటేల్ తిరుపతి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



డీఎస్సీ ద్వారా ఎంపికై నియామక పత్రాలు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. లక్షెటిపేట మండలంలో మొత్తం ఏడుగురు విధుల్లో చేరారు. ఇందులో ముగ్గురు ఎస్జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. మండల విద్యాధికారి హెలెన్ డారతికి రిపోర్టు చేసి ఆయా కాంప్లెక్స్ హెచ్ఎంలను కలిసి తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారు. పాఠశాలలో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహనీయుల అడుగు జాడల్లో పయనించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్



జైపూర్

రామాయణ మహాకావ్యం రూపకర్తగా, ఆదికవిగా మహర్షి వాల్మీకి మనిషి తలుచుకుంటే ఏమైనా సాధించగలడని నిరూపించారని, మహనీయుల అడుగు జాడల్లో పయనిస్తు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో రాజు ఏ విధంగా పరిపాలించాలి, ప్రజలు ఏ విధంగా పరిపాలించబడాలి అనేది తెలుపడంతో పాటు కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులు, పిల్లలు ఎలా మెదలాలి అనేది రామాయణ మహాకావ్యం ద్వారా వివరించారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి వాల్మీకి చేసిన సేవలు మరువలేనివని, అటవీ తెగకు చెందిన బోయవానిగా జన్మించి రామాయణం మహా గ్రంథాన్ని 23 వేల శ్లోకాలతో 7 ఖండములతో ఆదికావ్యంగా పూర్తి చేసి మహర్షిగా మారారన్నారు. మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శప్రాయుడని, మహనీయులు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనరల్ మేనేజర్ కార్యాలయంలో...

వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి,ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఆర్కె 7 గ్రూప్ ఏజెంట్ రాముడు, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి,సీనియర్ పీఓ పి కాంతారావు పాల్గొన్నారు.

జైపూర్ : జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్లాంట్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ రావు వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, చీఫ్ ఓఅండ్ఎం జేఎస్ సింగ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్ మోహన్, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం పాల్గొన్నారు.

మందమర్రి : వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ ఎం.సుమతి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ అచ్యుత్, ఇన్‌చార్జి మున్సిపల్ మేనేజర్ పి.కృష్ణ ప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వి శ్యాంసుందర్, సీనియర్ అసిస్టెంట్లు డి.లక్ష్మీ రాజం, ఏ.రాణి, హెల్త్ అసిస్టెంట్ ఎండీ.సమీర్, జూనియర్ అసిస్టెంట్లు ఈ.సంత్, బి.ప్రదీప్ కుమార్, పున్నం చందర్, ఇన్‌చార్జి టీఎంసీ ఏ రఘురాం, సిస్టం మేనేజర్ ఏ.శిరీష్, డీఈఓ నరహరి, ఈ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

హాజీపూర్ : మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం వాల్మీకీ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకీ చిత్రపటానికి కమాండెంట్ పి.వెంకటరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని చరితను లిఖించి రామాయణాన్ని మనకు అందించిన వాల్మీకీ మహర్షి మహనీయుడని కొనియాడారు. ఆయన జయంతిని రాష్ట్ర పండగగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. వేడుకలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, ఆర్ఎలు, ఏఆర్ఎస్సైలు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.



మందమర్రి



హాజీపూర్

పాత పద్ధతి ప్రకారమే సెలవులు



నవతెలంగాణ-మందమర్రి

పాత పద్ధతి ప్రకారమే గనులు డిపార్ట్‌మెంట్ల పైన సెలవులు చేయడం జరుగుతుందని ఏఐటీయూసీ నాయకులు శైలేంద్ర సత్యనారాయణ వెల్లడించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఏరియాలోని కెకె 5 గని, వర్క్‌షాప్‌లలో ధర్నా చేపట్టి గేట్ మీటింగ్ నిర్వహించారు. కెకె 5గని వద్ద బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, వర్క్‌షాప్ వద్ద బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు వరుసగా 3 రోజులు విధులకు హాజరు కాకపోతే జీఎం అనుమతి తీసుకోవాలనే యాజమాన్యం ఇచ్చిన ఏకపక్ష సర్క్యులర్‌ని నిరసిస్తూ ధర్నా చేశామన్నారు. మందమర్రి జీఎం దేవేందర్‌తో చర్చలు జరిపినంతరం సర్క్యులర్‌ను యాజమాన్యం ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. పాత పద్ధతి ప్రకారమే గనులు డిపార్ట్‌మెంట్ల పైన సెలవు చేయడం జరుగుతుందన్నారు. సమస్యపై కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమాలలో బ్రాంచ్ నాయకులు కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, పెద్దపెల్లి బానయ్య, టేకుమట్ల తిరుపతి, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్లు ములకలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, పిట్ కార్యదర్శిలు గాండ్ల సంపత్, సీహెచ్‌సీ పి.శర్మ, పిట్ నాయకులు రామ్‌లాల్, బ్రహ్మారెడ్డి, అజయ్, మస్కు భూమయ్య, పారిపెల్లి రాజేశం, కార్మికులు పాల్గొన్నారు.

బాల, బాలికలకు ఫెన్సింగ్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అండ్ స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14,17,19 ఫెన్సింగ్ బాల బాలికల ఎంపిక పోటీలు శ్రీరాంపూర్‌లోని సీఆర్ క్లబ్‌లో గురువారం నిర్వహించారు. ఈ పోటీలను ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ కనపర్తి రమేష్, క్రీడా సమాఖ్య కార్యదర్శులు చెరుకు ఫణి రాజా, బాబు రావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ 2002 లో ప్రారంభమైందని, 100 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారని, ఈ పోటీలకు విద్య ఉద్యోగ అవకాశాలు కూడా ఎక్కువని తెలిపారు. చదువుతో పాటు క్రీడాలలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, చెరుకు అనిల్, సీనియర్ క్రీడాకారులు ఈదునూరి వెంకటేష్, ఎర్ర కిషోర్, పీఈటీలు రాజేందర్, కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

హాజీపూర్ మండలానికి బతుకమ్మ చీరలు



నవతెలంగాణ-హాజీపూర్

మండలానికి గురువారం బతుకమ్మ చీరలు వచ్చాయి. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఈ ఏడాది బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు హాజీపూర్ మండలానికి గాను 5,880 చిన్న చీరలు, 1,350 పెద్ద చీరలు మొత్తం కలిపి 7,230 చీరలు వచ్చాయి. ఈ చీరలను త్వరలోనే మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేస్తామని ఐకేపీ ఏపీఎం రాజన్న తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా రాజేందర్

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా రాగం రాజేందర్, డివిజన్ సెక్రెటరీలుగా గొల్ల మహేందర్, శాంతం సంపత్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి తెలిపారు. గురువారం ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నస్పూర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరరీ గూడ శ్రీకాంత్, బొంపల్లి రమేష్, బోయిన మల్లయ్య, జల్లా తిరుపతి, గోళ్ళ మహేందర్, అడిగొప్పుల రాజకుమార్, కిరణ్ కుమార్, మంచాల రమేష్, ఆసరి విజయ్ కుమార్, చంద్రశేఖర్, కలవైన స్వామి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి దరఖాస్తుల గడువు పెంపు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని ఎస్సీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా స్కాలర్ షిప్ కోసం ఈ-పాస్‌లో దరఖాస్తు గడువును పొడగించినట్లు జిల్లా దళిత అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువును ఈనెల 29 వరకు పొడగించామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జీపీ నిర్వహణ పట్ల జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల నిర్వాహణపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. మండల పరిధి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించి జీపీల నిర్వాహణ పట్ల పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీల పరిధి ఎంపీడబ్ల్యూల వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, జమ ఖర్చులకు సంబంధించిన వివరాలను సైతం ఎప్పటికప్పుడు ప్రొఫార్మాల్లో పొందుపర్చాలని తెలిపారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. నర్సరీల ఏర్పాటు పూర్తి చేయాలని, విత్తనాల సేకరణ వివరాలు అందజేయాలన్నారు. మట్టి సేకరణ చేపట్టాలని గ్రీన్ బడ్జెట్ వివరాలు పంపించాలని కోరారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఈఎంఐ పెండింగ్ ఉంటే వెంటనే చెల్లించాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్ కంపోస్టు తయారి కొనసాగించాలని, ఎల్ఆర్ఎస్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేసి 10 శాతం వసూళ్ల పూర్తి చేయాలన్నారు. జిల్లా నుండి స్ప్రేడ్ షీట్ వచ్చినప్పుడు తొందరగా స్పందించాలని అవసరమైన సమాచారం అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం పీఆర్ అండ్ ఆర్‌ఈ కార్యాలయం నుండి నిర్ణయ్ యాప్‌పై నిర్వహించిన గూగుల్ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులో కలిసి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఉపాధి హామీ ఏపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న రాయమల్లు మృతదేహం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు బతుకుతెరువు కోసం కుర్దిస్తాన్ వెళ్లి ఆగస్టు 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతదేహాన్ని ఇండియాకు తీసుకు రావడంలో ఇరాక్ దేశంలో ఉన్న ఎల్ల స్వామి చింతగూడ గ్రామస్తులు సహకరించారని వారి తల్లిదండ్రులు మల్లయ్య, లక్ష్మి తెలిపారు. సంపంగి రాయమల్లుకు భార్య పిల్లలు లేరు. మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడానికి సహకరించిన ఎన్నారై శాఖ చిట్టి బాబుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. చింతగూడ గల్ఫ్ అసోసియేషన్ ప్రతినిధులు మెండే సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సుతారి వినయ్ కుమార్, గంగుల మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్లు ఆరె శిరీష్ కుమార్, అజ్మీరా బద్రి నాయక్ అంత్యక్రియలలో పాల్గొన్నారు.

నర్సరీ భూమి ఆక్రమణను అరికట్టాలి

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఉద్యానవనశాఖ అధికారులు

నవతెలంగాణ-జైపూర్



హర్టికల్చర్ నర్సరీ భూమి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిని కట్టడి చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కల్పన తహసీల్దార్ వనజా రెడ్డిని కలిసి కోరారు. పట్టాదారులమని చెప్పుకుంటు కొందరు గురువారం నర్సరీలోకి చొరబడి ట్రాక్టర్లతో నర్సరీ భూమిని చదును చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన హర్టికల్చర్ నర్సరీ భూమిలో కొంత ప్రభుత్వ భూమి కాగా మరికొంత పట్టా భూమి దాతలు దానంగా ఇచ్చారన్నారు. నర్సరీ ఏర్పాటుతో పాటు విస్తరించిన భూమి చుట్టు పెన్సింగ్ వేసుకోగా నర్సరీ భూమితో పాటు తమకు చెందిన పట్టా భూమి చుట్టు పెన్సింగ్ వేసుకున్నారని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కోర్టు తమకు అనుకూలమైన తీర్పు ఇచ్చిందని చెపుతున్న పలువురు పొజీషన్‌లో ఉన్న నర్సరీ భూమిలో చొరబడ్డారన్నారు. పోలీసులతో పాటు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి : తహసీల్దార్ వనజా రెడ్డి

హర్టికల్చర్ నర్సరీ భూమిలో పట్టాలు పొందిన వారు ఉన్నారు. పెగడపల్లి శివారు సర్వే నెం.178లో గల ప్రభుత్వ భూమిని నర్సరీ కోసం కెటాయించడం జరిగింది. సర్వే నెంబర్ 94లో గల కొంత భూమి నర్సరీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యానవన శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు స్థితిగతులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలి. అదేవిధంగా రెవెన్యూ రికార్డులతో నర్సరీ కోసం కెటాయించిన భూమి, పట్టాదారులుగా చెప్పుకుంటున్న వారి వద్దన గల ఆధారాలు సరిపోల్చి చూడాల్సి ఉంటుంది.

డెంగ్యూ కేసులు తగ్గాయి : డీఎంహెచ్ఓ హరీష్ రాజు



నవతెలంగాణ జన్నారం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయడంతో జిల్లాలో డెంగ్యూ కేసులు తగ్గాయని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్ అన్నారు. గురువారం మండలంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. మందుల వివరాలను ఫార్మసిస్ట్ కృష్ణవేణిని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. పిల్లలకి ఇచ్చే వ్యాక్సిన్ పరిశీలించి ఎలా వాడుతున్నారని తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు బాగా లేకపోతే చర్యలు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జిల్లాలో అప్రమత్తంగా ఉన్నామని, దీని కారణంగా డెంగ్యూ కేసులు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. జిల్లాలో మలేరియా లేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఒక చికెన్ గున్యా కేసు మాత్రమే నమోదైందన్నారు. వసతి గృహా అధికారులు పీహెచ్‌సీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటు పిల్లలకు ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులకు ఎలాంటి సమస్యలు రాకుండా టెస్ట్ చేసి సిబ్బంది వైద్యం అందిస్తారన్నారు. అదే విధంగా మండలంలో ఇప్పటి వరకు 10 సబ్ సెంటర్లు ఉండగా కొత్తగా నాలుగు సబ్ సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో కిష్టాపూర్, కామన్‌పల్లి, రోటిగూడ, ధర్మారం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫైజ, డిఎస్ఓ, బుక్క వెంకటేశ్వర్లు, డిఎంఓ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎల్ఎం బృందం పర్యటన

- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ

నవతెలంగాణ-హాజీపూర్



నేషనల్ లెవెల్ మానిటర్స్(ఎన్ఎల్ఎం) బృందంలోని సభ్యులు గురువారం హాజీపూర్ మండలంలోని బుద్ధిపల్లి, పెద్దంపేట గ్రామాలను సందర్శించారు. కేంద్ర కమిటీ సభ్యులు సీ.వీ.బాలమురళీ, కె.హెచ్.సునీల్ మండల, గ్రామ స్థాయి అధికారులతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా పంచాయతీల రికార్డులు, నగదు పుస్తకాలు, పెన్షన్, జనాభా లెక్కల వివరాలను పరిశీలించిన అనంతరం పంచాయతీ ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సాధిస్తున్న ఆర్థిక పురోగతి వివరాలు తెలుసుకున్నారు. నూతన జీపీ భవనం, నర్సరీ, ప్లాంటేషన్ తదితర పనుల పర్యవేక్షణతో పాటు పంచాయతీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను, ఉపాధి హామీ పనులను, ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జీపీడీపీ ప్రణాళిక తయారీ విధానం గురించి తెలుసుకున్నారు. ఈ బృందం వెంట ఎంపీడీఓ రత్నప్రసాద్, ఎంపీఓ ఉమర్‌షరీఫ్, ఈజీఎస్ ఏపీడీ సదానందం, ఏపీఓ మల్లయ్య. ఈసీ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రాజన్న, పంచాయతీ కార్యదర్శులు రఘు, రూపాదేవి, టీఏలు స్రవంతి, వెంకట్, ఎఫ్ఏ మల్లేశ్మ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

సిట్టింగ్ పాయింట్‌కి జరిమానా

నవతెలంగాణ-మందమర్రి



నిల్వ ఆహార పదార్థాలు విక్రస్తున్న సిట్టింగ్ పాయింట్‌కి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. గురువారం బస్టాండ్ ప్రాంతంలోని కనకదుర్గ వైన్ షాప్ పక్కన కుమార్ సిట్టింగ్ పాయింట్‌లో ఫ్రిడ్జ్‌లో 2 రోజులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేసి షాప్ యజమానికి రూ.2000 జరిమానా విధించారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ ఎండీ సమీర్, ఇన్‌చార్జి మేనేజర్ పి.కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బంగారు శ్రీనివాస్, బిల్ కలెక్టర్ బూర్ల లింగయ్య పాల్గొన్నారు.

టీఏజీఎస్ ఆధ్వర్యంలో భీమ్ వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) ఆధ్వర్యంలో కుమురం భీమ్ వర్ధంతిని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తొడసం భీంరావు మాట్లాడుతూ భూమికోసం, అడవిపై హక్కు కోసం నాడు కుమురం భీమ్ పోరాటం చేసినా ఆయన కోరిన అభివృద్ధి, హక్కులు నేటికీ ఆదివాసులకు దక్కలేదన్నారు. అనేక గిరిజన గ్రామాలు, రోడ్లు, కరెంటు, తాగు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భీమ్ ఆశించిన అభివృద్ధికి ఆదివాసీలు సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, తొడసం కోత్మ, రైతు సంఘం నాయకులు బండి దత్త్రాతి, కార్మిక సంఘం నాయకులు దర్శనాల మల్లేష్, మంజుల పాల్గొన్నారు.

శిశువు మృత దేహం లభ్యం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బోరిగాం గ్రామ శివారులోని కల్వర్టు వద్ద నీటిలో మగ శిశువు మృతదేహం తెలియదు కనిపించడం కలకలం రేపింది. కల్వర్టు వద్ద నీటిలో ఒక మగశిశువు మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్ అక్కడి చేరుకొని జలారుల సాయంతో శిశువు మృతదేహం బయటకు తీసి పోస్టమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చున్నంబట్టి వాడకు చెందిన ఎటకారి వెంకటేష్(38) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ముత్తె ప్రవీణ్ తెలిపారు. బుధవారం రాత్రి పని నిమిత్తం 100 ఫీట్ల రోడ్డు నుండి మంచిర్యాల వైపు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. మంచిర్యాల నుండి నస్పూర్ కు వేగంగా వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో వెంకటేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పట్టణంలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య సృజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సీఐగా వేణుచందర్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ సీఐగా వేణు చందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శ్రీరాంపూర్‌లో సీఐగా పని చేసిన మోహన్‌ను మల్టీజోన్ 1ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల సీసీఎస్‌లో పనిచేసిన వేణుచందర్ శ్రీరాంపూర్‌కు బదిలీ అయ్యారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్యాన్సర్ బాధితురాలు రాథోడ్ మీరాకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. అల్లూరి భూపతి రెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.20 వేల చెక్కును గురువారం అందజేశారు. కష్టకాలంలో తనను ఆదుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు, అల్లూరి భూపతిరెడ్డికు గంగ్రత్ నారాయణకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేర దేవన్న, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డి, సంజయ్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నస్పూర్

డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ఆయుర్వేద వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య పరీక్షలు నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో శుక్రవారం ఉ.10గం. నుండి సాయంత్రం 6గం. వరకు జరుగుతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ లాంటి వ్యాధులు కీళ్ల, నడుము నొప్పులు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండ గ్రామపంచాయతీలో గురువారం తాడిహత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీనివాస్ వినియోగదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ అందిస్తున్న క్రాప్‌లోన్, మహిళ సంఘాల రుణాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ బీమా, డిజిటల్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ అందించే రుణాలను సక్రమంగా వినియోగించుకొని తిరిగి చెల్లించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సునీల్, గంగోలి, సీసీ సంతోష్, సీఎస్‌సీ నిర్వాహకులు రవీందర్ ఫడ్, వీఓ గోవింద్, గ్రామపెద్దలు జాదవ్ దత్త, జితేందర్, బడేఖాన్, కాశీరాం, గంగారాం పాల్గొన్నారు.

రేపు కుభీర్‌కు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కల్యాణలక్ష్మీ షాదీముబారక్ లబ్దిదారులకు శనివారం అందజేసే చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరవుతున్నారని మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 120 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో శనివారం ఉదయం 10 గంటలకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కార్యకర్తలు, లబ్దిదారులు సమయపాలన పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోని విద్యను అందరికి అందించేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకి జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా సమీకృత బీసీ భవనాలు, వసతి గృహాల సమస్యలను గుర్తించి, పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికి తెలియాలన్నారు. అందుకే ప్రభుత్వం కూడా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఆయన ఆలోచన విధానాలతో పాటు రామాయణంలోని అంశాలను ప్రతి పాత్యంలో ఉన్నాయన్నారు. విద్యపై శ్రద్ధ తీసుకుంటూ తమ పిల్లలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేలా ప్రతి తల్లిదండ్రి కృషి చేయాలని సూచించారు. సమీకృత బీసీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని వాటిని పూర్తి చేసేలా మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, అదే విధంగా వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి మహర్షి గురించి నేటి తరం వారికి తెలియజేసేలా ప్రభుత్వం జయంతి ఉత్సవాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. బీసీలు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్ : వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రామాయణాన్ని రచించింది ఒక బోయ కులానికి చెందిన వాల్మీకి అన్నారు. ఆ మహర్షి ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా, కవులుగా మారారని అన్నారు. రామాయణం, మహాభారతం సారాంశాలను ఈ తరం విద్యార్థులకు తెలియజేయాలనీ, ఇలాంటి గొప్ప వారి చరిత్రలను భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, సీపీఓ జీవరత్నం, డీఎస్ఓ కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడెం : మండలంలోని అంబారిపేట్ గ్రామంలో మహర్షి వాల్మీకి బోయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోయ కమిటీ సభ్యులు తాటికొండ వెంకటేష్, నర్ర వెంకటేష్ మాట్లాడారు. ఎందరో మహనీయులు జన్మించిన పుణ్యభూమి భారతభూమి అని అన్నారు. ఈ తరం వారు వాల్మీకి లాంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకొని స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయ కులస్తులు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, ఖానాపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాక భూమన్న, శెటిపెల్లి మహేందర్, కొప్పుల సత్తన్న, కొప్పుల రమేష్, పెంబట్ల రమేష్, పెంబట్ల శ్రీధర్, గ్రామ కార్యదర్శి కొమ్ము మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా మహిళాశక్తి



నవతెలంగాణ-నస్పూర్

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కృషి చేస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార అంశాలలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలో క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు సెప్టెంబర్ 19 నుండి 28 వరకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్మెంట్-హైదరాబాద్‌లో అందించిన శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో అనేక అంశాలను పొందుపరిచి మహిళలకు అవకాశం కల్పించడంతో పాటు రుణ సదుపాయాన్ని కల్పిస్తూ ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, డైరీ ఫార్మ్, కోళ్ళు, చేపల పెంపకం, మీ-సేవతో పాటు వివిధ యూనిట్ల స్థాపనకు అవకాశం కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల యూనిట్లను ఎంపిక చేసుకున్న లక్షెట్టిపేటకు చెందిన జమున, హాజీపూర్‌కు చెందిన జ్యోతి, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ఎంపిక చేసుకున్న హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ధనలక్ష్మిలకు ధ్రువపత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌పై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు పరిష్కరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ఎక్కువ లాగిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి వివరాలను నమోదు చేసి, అధికారులకు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్ఓ భుజంగ్‌రావ్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేష్ కుమార్, మనోహర్, డీపీఓ శ్రీనివాస్, రెవెన్యూ, ఇరిగేషన్, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర మనకంటే ఎక్కువ ఎందుకుంది...?



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి పంటలో ఆదిలాబాద్‌కు ఆసియాలో పేరుందని, కానీ ఇక్కడి కంటే గుజరాత్ పత్తికి మద్దతు ధర ఎక్కువగా ఎందుకు ఉందో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేవలం గుజరాత్‌కు పీఎంలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్ పత్తికి డిమాండ్ ఉన్న కూడా ఇక్కడ క్వింటాల్‌కు రూ.7500 ప్రకటించి, దానికి కూడా 8 నుంచి 12 శాతం మేలిక పెట్టారన్నారు. కానీ గుజరాత్‌లో పత్తికి మాత్రం రూ.8,800 ప్రకటించారని తెలిపారు. గుజరాత్ పత్తి కంటే ఆదిలాబాద్ పత్తి ఎంతో నాణ్యమైందన్నారు. కానీ ఇక్కడ మద్దతు ధర తక్కువగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. మద్దతు ధరలపై ఇతర రాష్ట్రలకు రైతుల సంఘాల ప్రతినిధులు, రైతులను తీసుకెళ్లి పరిశీలించాలన్నారు. బీఆర్ఎస్ హయంలో తాము అలా చేశామని గుర్తు చేశారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి వచ్చిన కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన మద్దతు ధర, కొనుగోళ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విఫలమాయ్యయని ఆరోపించారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షులు అజయ్, రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బాని, రాజు, పరమేశ్వర్, సేవ్వా జగదీష్, బట్టు సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం విడుదల

నవతెలంగాణ-బేల

మండలంలోని పెన్ గంగా నది పరివాహక గ్రామాలలో గత నెల వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం విడుదలైంది. 490 మంది రైతుల అకౌంట్‌లో నేరుగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.86 లక్షలు విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డితో పాటు అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు భేదోడా గ్రామ రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి తమ పంటలు భారీ వర్షాల వల్ల ముంపునకు గురివుతున్న ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కేవలం ఒక నెల వ్యవదిలోనే పంట నష్ట పోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నేరుగా అకౌంట్‌లోకి డబ్బులు జమ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోథ్ : మండలంలోని దన్నూర్-బి గ్రామ ప్రజల చిరాకాల కోరిక వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల 30 లక్షలు మంజూరు చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామాన్ని సందర్శించి హై లెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్ర మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నవతెలంగాణ-లోకేశ్వరం



తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని హావర్గ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం..హావర్గ గ్రామానికి చెందిన తున్గోళ్ల గంగాధర్ కుటుంబీకులతో కలిసి జగిత్యాలలోని అత్తగారి ఇంటికి మంగళవారం వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగల గొట్టి ఉంది. బీరువా తాళం పగలగొట్టి రూ.1.30లక్షల నగదు, 10 గ్రాముల బంగారం దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

నవతెలంగాణ-ముథోల్

రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసారిగా వేయించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. పశువుల ఆస్పత్రిలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గురువారం మండల పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్, మండల పశువైద్యదికారి రవిందర్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరిపోతన్న, నాయకులు నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, తాటివార్ రమేష్, సుదర్శన్, మోహన్ యాదవ్, పోతన్న, శ్రీనివాస్, సాయినాథ్ పాల్గొన్నారు.

దండేపల్లి : పశువులు రోగాల బారిన పడకుండా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డా.ధనరాజ్ అన్నారు. గురువారం మండలంలోని గూడెం గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముందస్తుగా టీకాలు వేయడంతో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తోట మోహన్, పశువైద్య సిబ్బంది స్వప్న, కుమార్, శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లాగే మోసం చేస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అభివృద్ధి, సంక్షేమం విషయంలో బీఆర్ఎస్ ఏ విధంగా మోసం చేసిందో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే ఆలోచనతో పరిపాలన సాగిస్తుందని, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైనథ్ మండలం బెల్లూరి గ్రామ మాజీ ఉప సర్పంచ్ దుర్వ చంపత్‌రావ్‌తో పాటు గ్రామానికి చెందిన 200 మంది బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల అధ్యక్షుడు రాందాస్, నాయకులు అశోక్‌రెడ్డి, లాలామున్న, పోతరాజు, రమేష్, రవి, రాకేష్, రమేష్, కృష్ణారెడ్డి, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముధోల్ అభివృద్ధికి పెద్దపీట

నవతెలంగాణ-ముథోల్

ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి సంబంధించిన 100 చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తాను గెలిచినప్పటి నుంచి 10 నెలల్లో ముధోల్ నియోజకవర్గంలో 2500 కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఆడబిడ్డ పెండ్లి చేసిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్, బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, మోహన్‌రెడ్డి, తాటివార్ రమేష్, సప్పటోల్ల పోతన్న, కదం సంతోష్, శ్రీనివాస్, జీవన్, దత్తాత్రి, లక్ష్మీనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమాజానికి బుద్ధుని మార్గమే సరైంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రపంచంలో శాంతిని భోధించిన బౌద్ధ ధర్మంలోని బుద్ధుని మార్గమే సరైందని సమతా సైనిక్ దళ్ దక్షిణభారత సంఘటకులు మార్షల్ దీపక్ వాఘ్మారే అన్నారు. గురువారం పిప్పల్‌ధరి గ్రామంలోని లుంబిని బుద్ధ విహార్‌లో నిర్వహించిన వర్షవాస్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతి, కరుణ, మైత్రి సందేశాన్ని అందించిన బుద్ధుడి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఆనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజ్య బంతే బుద్ధఘోష్, సెంట్రల్ కమిటి మెంబర్ రవిచంద్ర జాబడే, తెలంగాణ రాష్ట్ర సంఘటకులు శీలనంద్ కాంబ్లే, ఆదిలాబాద్ జిల్లా సంఘటకులు రమాకాంత్ కాంబ్లే, మహిళ సంఘటకులు అశ్విని, పిప్పల్‌ధరి మండల సాధన కమిటి అధ్యక్షులు తెలంగ్ బాపురావ్, లుంబిని బుద్ధ విహార్ కమిటి సభ్యులు గులే మోహన్, టంకే నాగోరావ్ పాల్గొన్నారు.

భీం తెగువను అలవర్చుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రతి ఆదివాసీ బిడ్డ కుమురం భీమ్ తెగువను అవర్చుకోవాలని టీఏజీఎస్ అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. మండలంలోని యాపలగూడలో 84వ కుమురం భీమ్ వర్ధంతిని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉయిక విష్ణు మాట్లాడుతూ ఆదివాసులకు జల్ జంగల్ జమీన్ హక్కు కోసం ప్రాణాలర్పించిన కుమురం భీమ్ తెగువను ప్రతి ఆదివాసీ బిడ్డ అంది పుచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చుట్టూ పక్కల ఆరు గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసులు చేసిన సాంప్రదాయ నృత్యాలు ఆలరించాయి. కార్యక్రమంలో గ్రామ పటేల్ కొడప నారాయణ, లంక రాఘవులు, స్వామి, భారత్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.